సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 2 । జూన్ । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,827

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,827 పలికింది. కనిష్టం రూ.6,229, నగటు రూ.6,511గా నిర్ణయించినట్లు ఇన్‌చార్జి అధికారి సతీశ్ తెలిపారు.



జిల్లాకు డిజిటల్ బీపీ మెషీన్లు

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



స్కూల్ యజమానులతో ఆర్టీఓ రంగారావు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు ప్రైవేటు స్కూల్ బస్సులు రవాణాశాఖ నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు అన్నారు. ఆర్టీవో కార్యాలయంలో గురువారం స్కూల్‌బస్సుల యజమాన్యాలతో సమావేశమై పలు సూచనలిచ్చారు. ఫిట్‌నెస్ పరీక్షలు, వాహనాలలో చేయాల్సిన ఏర్పాట్లపై వివరించారు. ఎంవీఐ శ్రీనివాస్, పాఠశాల యజమానులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమకారులను ఆదుకోవాలి



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న జ్యోతి రెడ్డి

సుల్తానాబాద్/మంథని: మహిళా ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ మహిళ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి కోరారు. గురువారం సుల్తానాబాద్, మంథనిలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, దశాబ్ది ఉత్సవాల్లో మహిళా ఉద్యమకారులను గౌరవించాలని కోరారు. సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు డబుల్ బెడ్ రూంలు, దళితబంధు, బీసీ రుణాలు తదితర వాటిల్లో ఇరవై శాతం వాటా కేటాయించాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. బస్సులు, ట్రైన్లతో ప్రత్యేక రాయితీ కల్పించాలన్నారు. కటకం వనజారాణి, ముస్కె ఈశ్వరమ్మ, సునీతరెడ్డి, లలితా ఠాగూర్, తదితరులు ఉన్నారు.

పద్య, వచన, కవిత పోటీలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా సాహిత్య దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి గల కవులు, కవయిత్రిలు ఈనెల 6లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని డీఈఓ మాధవి కోరారు. తెలంగాణ అస్తిత్వం, ప్రగతి ప్రతిబింబించేలా పద్య, వచన, కవిత పోటీలు తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాషా పోటీల్లో పాల్గొనేవారు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోని ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయంలో సునిల్‌కుమార్ 98492 63284 నంబర్‌లో, ఉర్దూలో పాల్గొనే వారు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ కార్యాలయంలో 94400 08 814 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.


గడువు పొడిగింపు...

పోస్ట్‌మెట్రిక్ ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 15వరకు పొడిగించామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఆపై చదువుతున్న అర్హులైన ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కాయకల్ప'కు రెండు సబ్ సెంటర్ల ఎంపిక

ధర్మారం: నందిమేడారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని రెండు సబ్‌సెంటర్‌లు కాయకల్ప అవార్డులకు ఎంపికై నట్లు వైద్యాధికారి అనుదీప్ తెలిపారు. ఖిలావనపర్తి, దొంగతుర్తి సబ్‌సెంటర్‌లు పేషెంట్, ఓపీడీ, గర్భిణులకు సేవలు, చిన్నారులకు టీకాలు, అంటువ్యాధుల నివారణ, పచ్చదనం, పరిశుభ్రత వంటి విభాగాల్లో మంచి పనితీరు ప్రదర్శించి అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయపార్టీల నాయకులు సహకారం అందించాలని కలెక్టర్ సంగీత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. రెండవ ఓటరు జాబితా కార్యక్రమాన్ని ఎన్నికలసంఘం చేపట్టిందని, 1 అక్టోబర్ 2023 నాటికి18 ఏళ్లునిండిన వారంతా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 12 నుంచి ఈవీఎం వీవీప్యాట్ల ఎఫ్ఎల్‌సి ప్రారంభమయ్యే అవకాశముందన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటమాధవరావు, డీటీ ప్రవీణ్‌తో పాటు రాజకీయపార్టీల ప్రతినిధులున్నారు.

వడివడిగా.. ప్రగతి దిశగా..



నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా యావత్ తెలంగాణ ప్రజానీకం పోరాటంతో సాధించుకున్న స్వరాష్ట్రం నేడు పదో వసంతంలోకి అడుగుబెట్టనుంది. సబ్బండవర్గాల పోరాటం, అమరుల త్యాగఫలంతో ఏర్పడిన రాష్ట్రంలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాయా.. అంటే ఆశించిన స్థాయిలో జరగలేదనే సమాధానం వినిపిస్తోంది. కొన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు పెట్టగా.. మరికొన్ని అంశాల్లో ఇంకా పోరాటమే మిగిలిందనే వాదన ఉద్యమకారుల నుంచి వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో తొమ్మిదేళ్లలో చోటుచేసుకున్న అభివృద్ధి, ఇంకా నెరవేరాల్సిన ఆకాంక్షలపై..

- కొత్త జిల్లాతో నెరవేరుతున్న ఆకాంక్షలు
- ప్రగతి చాటేలా కార్యక్రమాలు
- నేటినుంచి 21రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు
- జెండావిష్కరణతో వేడుకలు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

సాక్షి, పెద్దపల్లి:

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 2016 అక్టోబర్ 11న దసరా పండుగ రోజు పెద్దపల్లి కొత్త జిల్లాగా ఆవిర్భవించింది. అలాగే కొత్తగా మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలుగా.. 61 కొత్త గ్రామ పంచాయతీలు, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి మండలాలు ఏర్పాటయ్యాయి. పరిపాలన సౌలభ్యం కోసం రూ.48కోట్లతో సమీకృత కలెక్టరేట్, రూ.38.50కోట్లతో రామగుండం కమిషనరేట్ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ ఆకాంక్షల మేరకు జిల్లాలో ప్రగతి వైపు అడుగులు పడేందుకు వివిధ శాఖల అధికారులు కృషి చేస్తున్నారు. అయితే కొత్త మండలాలు, పంచాయతీలు ఏర్పాటు చేసినా పూర్తి స్థాయి సిబ్బంది, శాశ్వత భవనాలను ఏర్పాటుకాకపోవడంతో అవస్థల మధ్యే కొనసాగుతున్నాయి.

మెడికల్ కాలేజీ.. మాతాశిశు సంరక్షణ కేంద్రాలు

జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కావటంతోపాటు, కొత్తగా రామగుండంలో రూ.500కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి, మంథనిలో మాతా శిశుసంరక్షణ కేంద్రాల ఏర్పాటుతో గర్భిణులకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు, సపోర్టింగ్ స్టాఫ్ లేక రోగులకు వైద్యం అందటం లేదు.



ప్రతి ఇంటికీ సంక్షేమం

ప్రభుత్వం ఆసరా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, గొర్రెలపంపిణీ, చేపపిల్లల విడుదల, దళితబంధు, పల్లె, పట్టణప్రగతి, కంటివెలుగు సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ సంక్షేమఫలాలు అందేలా పథకాలు రూపకల్పన చేసి, కొంత మార్పు తీసుకొచ్చారు. డబుల్ బెడ్రూం, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన తదితర హామీల వైఫల్యంపై పెదవి విరుస్తున్నారు. మిషన్ భగీరథతో ప్రతిఇంటికీ తాగునీరు అందడం లేదనే ఆరోపణలున్నాయి.

కాళేశ్వరం.. ఎస్సారెస్పీ స్థిరీకరణ

సాగు, తాగు, పారిశ్రామిక నీటి అవసరాలు తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.80,500 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నారం సరస్వతి, సుందిళ్ల పార్వతి బ్యారేజీలను నిర్మించారు. వాటి ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసిన నీటని గ్రావిటీ ద్వారా జంట సొరంగాల ద్వారా నంది పంపుహౌజ్‌లోకి.. అక్కడి నుంచి గాయిత్రీ పంప్‌హౌజ్‌లో ఎత్తిపోసేలా నిర్మాణాలు చేపట్టారు. అక్కడి నుంచి ఎస్సారెస్పీ వరదకాల్వలోకి ఎత్తిపోసి ఎస్ఆర్ఆర్ (మిడ్ మానేరు) ఆయకట్టును స్థిరీకరించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు పంటలకు నీరు అందేలా చూస్తున్నారు. ఫలితంగా జిల్లాలో చివరి ఆయకట్టుకూ నీరందుతోంది. గతంలో కంటే జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. మంథని మండలం పోతారం లిఫ్ట్ ఇరిగేషన ఎత్తిపోతల పథకం ప్రతిపాదించినా పట్టాలెక్కలేదు. ఇది అందుబాటులోకి వస్తే సుమారు 60వేల ఎకరాలు సాగులోకి రానుంది. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో సుమారు 100గ్రామాలు నీటమునుగుతున్నాయి. పరిహారం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా బండల వాగులోకి ఎత్తిపోసి.. సమీపంలోని పాలకుర్తి మండలానికి సాగునీరు అందించే పథకం పనులు త్వరగా పూర్తిచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

సింగరేణిలో పెనుమార్పులు..

సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా దిగిపోయిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టారు. అలాగే రూ.10 లక్షల వరకు సొంత ఇంటి నిర్మాణం కోసం వడ్డీ లేని రుణం, ప్రత్యేక ఇంక్రిమెంట్ మంజూరు, 4600 మంది ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలు, పెండింగ్ డిపెండెంట్లకు వన్ టైం సెటిల్మెంట్ కింద ఉద్యోగాలు, సకలజనుల సమ్మెలో పాల్గొన్న వారికి వేతనాలు చెల్లించడంతో కార్మికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఏళ్లతరబడి సింగరేణి కార్మికుల మారు పేర్లు మార్పు అమలుకాకపోవడం, కోల్ ఇండియాలాగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెరగకపోవటంపై అసంతృప్తి ఉంది.

పకడ్బందీగా ఏర్పాట్లు..

శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను 21 రోజులపాటు నిర్వహించనున్నారు. తొమ్మిదేళ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, ప్రగతిని చాటేలా రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి ఊరు, వాడలో దశాబ్ది ఉత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించేలా జిల్లాయంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది.

సాధించిన ప్రగతిపై విస్తృత ప్రచారం

రాష్ట్రం ఏర్పాటుకు ముందు పరిస్థితులు.. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరిగిన ప్రగతిపై ప్రజలకు వివరించనున్నారు. అన్ని రంగాల్లో జరిగిన అభివృద్ధిపై అవగాహన కల్పించనున్నారు. ఆయా కార్యక్రమాల సందర్భంగా సహపంక్తి భోజనాలు, ఊరూరా సభలు నిర్వహించనున్నారు. దశాబ్ది ఉత్సవాలు అన్నిశాఖల సమన్వయంతో విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. రెవెన్యూ, పోలీస్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, వ్యవసాయం, సంక్షేమం, విద్యుత్ తదితర విభాగాల సహకారంతో కార్యక్రమాలను నడిపించనున్నారు. అన్ని కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయనున్నారు.

కలుషితమవుతున్న గోదావరి

గోదావరిపై బ్యారేజీలతో రామగుండం, మంథని వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. ఈ సమస్య నివారణకు గోదావరిపై కరకట్టలు నిర్మించాల్సి ఉండగా.. ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పారిశ్రామిక ప్రాంతంలో మురుగు శుద్ధికేంద్రాలు ఏర్పాటు చేయకపోవంతో డ్రైనేజీ వాటర్ నేరుగా గోదావరిలో కలుస్తోంది. ఆ నీరు తాగడానికే కాదు, కనీసం స్నానం చేయడానికి కూడా పనిరాకుండా విషపూరితంగా మారుతున్నాయి. జిల్లాలో గోదావరి తీరంతోపాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఆదివరాహ స్వామి, రామునిగుండాలు, రామగిరిఖిల్లా తదితర ప్రాంతాలను అభివృద్ధిచేసి పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

స్థానికులకు దక్కని ఉద్యోగాలు

పారిశ్రామికప్రాంతంగా పేరున్న రామగుండంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటైనా అందులో స్థానికులకు ఉద్యోగాలు తక్కువేనని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతంలో స్థానికులకు ఉపాధికల్పన కోసం అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేయకపోవడంపై జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు



పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద ఉత్సవాల వివరాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ను సుందరంగా కనిపించేలా రంగురంగుల ముగ్గులు వేయించారు. బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం షామియానాలు, కుర్చీలు వేయించారు. శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విఫ్ టి.భానుప్రసాదరావు శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కలెక్టర్ సంగీత, డీసీపీ వైభవ్‌గైక్వాడ్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, డి.శ్రీధర్‌బాబు హాజరవుతారు.

ముఖ్య అతిథిగా భానుప్రసాదరావు

ఈనెల 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాద్ రావు హాజరవుతున్నారు. ఉదయం 8.45కు జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తారు. కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 8.58 గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తారు.

ఘనంగా ఏర్పాట్లు



దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం అయ్యేలా సహకరించాలి. 21 రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సంగీత, కలెక్టర్

దగాపడిన తెలంగాణలో దశాబ్ది ఉత్సవాలా?

- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఎప్పుడో?
- నిరుద్యోగులతో చెలగాటం వద్దు
- పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయ రమణారావు

సుల్తానాబాద్: దగాపడిన తెలంగాణలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం శోచనీయమని పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లోగల హనుమాన్ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ మాటలకు.. చేతలకు పొంతన లేకుండా పోతోందన్నారు. ధాన్యాన్ని కాంటా వేసినా మిల్లర్లు ఆరు నుంచి పది కిలోల వరకు తరుగు తీస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి నేటికీ ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల వైఫల్యాలను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, మాజీ జెడ్పీటీసీ సారయ్య గౌడ్, సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల రాములు, దామోదర్ రావు, కుమార్ కిషోర్, అమిరిశెట్టి తిరుపతి, రాజలింగు, అనిల్, నన్ను, రాజయ్య, రాజు, సాయిరి మహేందర్, పద్మ, శేఖర్, పరుశరాములు, వేగోళం శంకర్ పాల్గొన్నారు.


అన్ని రంగాల్లో పల్లెలు అభివృద్ధి



పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: సీఎం కేసీఆర్ సారథ్యంలో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. అలాగే మహిళా సంఘం భవన నిర్మాణానికి, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి నిధులు కేటాయిస్తూ.. వాటి ప్రగతికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కళ్లున్నా చూడలేనివారుగా మారారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీల నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే సత్తా లేక బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాగిరెడ్డి అనిత, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పుస్కూరి నర్సింగరావు, ఎంపీటీసీ గాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు ఎగ్గెల స్వామి, మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, పుచ్చకాయల మునిందర్‌రెడ్డి, నాడెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి సమన్వయంతో పనిచేద్దామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మంథనిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రాల్లో నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆయా శాఖల వారీగా ఉత్సవాలు ఉంటాయన్నారు. ప్రధానంగా ఐదు నుంచి ఆరు రోజులు సామూహిక భోజనాలు, ఇతరత్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తే సక్సెస్ అవుతామన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రం సస్యశ్యామలం



కాల్వశ్రీరాంపూర్: దశాబ్ది వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో శ్రీభక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సాగునీటి పథకాలు పూర్తి కావడంతో చివరి భూములకూ నీరందుతోందని, రాష్ట్రం సస్యశ్యామలం అవుతోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు రైతులు గుండెల్లో గుడి కట్టుకున్నారని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో రైతులు, ప్రజలు, వ్యవసాయ కూలీలు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈద వెంట సర్పంచులు ఆడెపు శ్రీదేవి, బైరం రమేశ్, అడ్వకేట్ సతీశ్, ఏఎంసీ డైరెక్టర్ రాజమల్లు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికలపై ముందడుగు

ఈనెల 13న డీవైసీఎల్‌సీ వద్ద సమావేశం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై ముందడుగు పడింది. ఈనెల 13న ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్‌సీ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు అన్ని కార్మిక సంఘాలను కోరారు. ఎన్నికల షెడ్యూల్ తయారు చేయడం, ఎన్నికల తేదీ ఖరారు, ఓటరు జాబితాకు కటాఫ్ తేదీ, నామినేషన్ల ప్రక్రియ, సింబల్స్ కేటాయింపు, తదితర అంశాలపై చర్చించేందుకు రావాల్సిందిగా కోరారు. రహస్య బ్యాలెట్ పద్ధతి ప్రకారం ఓటింగ్ చర్చించనున్నట్లు వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ పాలకవర్గం



బాధ్యతలు స్వీకరిస్తున్న జడల సురేందర్, చిత్రంలో ఎమ్మెల్యే దాసరి, పాలకమండలి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, కమిటీ సమర్థవంతంగా పనిచేసి రైతులకు మేలు చేయాలని సూచించారు. యార్డులో రైతులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో మార్కెట్ కమిటీ సేవలను విస్తృతపర్చుతామన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలోని కార్యాలయంలో కమిటీ చైర్మన్ జడల సురేందర్, పాలకమండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, పాలకమండలి సభ్యులు సరోత్తంరెడ్డి, సంతోష్, రాములు, కృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పొట్టాల రవి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పట్టుకొని, గురువారం అతనికి అప్పగించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుంటే మొబైల్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు.

మణుగూర్, జగదల్‌పూర్‌కు ఆర్టీసీ బస్సులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని నుంచి మంథని, కాటారం, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం మీదుగా మణుగూర్‌కు శుక్రవారం నుంచి ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు నడిపించనున్నట్లు డిపో మేనేజర్ పి.మల్లేశం తెలిపారు. అలాగే కరీంనగర్ నుంచి గోదావరిఖని, చెన్నూర్ మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోని జీజాపూర్, జగదల్‌పూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు గోదావరిఖని నుంచి ప్రతిరోజూ ఉదయం 8గంటలకు బయల్దేరుతుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. రెబ్బల్‌దేవ్‌పల్లి చెందిన సాయిరాం గురువారం బైక్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. కాట్నపల్లి శివారులో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న జూలపల్లి మండలం తెలుకుంటకు చెందిన రామస్వామి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన ఆరవేని మల్లయ్య (70) అనారోగ్యంతో గురువారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మందులు వాడుతున్నా నయం కాకపోవటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దశాబ్ది వేడుకల ఏర్పాట్లు పరిశీలన



కమాన్‌పూర్(మంథని): సెంటనరీకాలనీ రాణీ రుద్రమదేవి క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి నిర్వహించే తెలంగాణ దశాబ్ది వేడుకల ఏర్పాట్లను జీఎంలు మనోహర్, వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఉత్సవాలకు హాజరయ్యేవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులు రఘుపతి, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, కర్ణ, పద్మరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

జగిత్యాలక్రైం: జాబితాపూర్ గ్రామానికి చెందిన రాజుల రాజేందర్ (30) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజేందర్ గురువారం ఉదయం చాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. జగిత్యాలలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, మూడేళ్ల కూతురు ఉంది.

4 లక్షల మందికి 'కంటివెలుగు'

- నేటితో ముగియనున్న కార్యక్రమం
- కాటరాక్ట్, టెరీజియం సమస్యలే ఎక్కువ

జిల్లాలో మండలాలు	14
జనాభా	8,89,729
18 ఏళ్లు దాటినవారు	4,87,124
పరీక్షలు చేసింది	3,91,219 (మే 31వరకు)
అద్దాల పంపిణీ	65,336
కాటరాక్ట్ గుర్తింపు	36,023
టెరీజియం ఉన్నది	14,176



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమం శుక్రవారంతో ముగియనుంది. జిల్లా మొత్తంగా నాలుగు లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా వయస్సుతోపాటు వచ్చే కంటి సమస్యలున్నాయని, అవసరమైన మందులు, కొందరికి అద్దాలు అందించామని అధికారులు పేర్కొన్నారు. పరీక్షల్లో కాటరాక్ట్, టెరిజియం సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని వివరించారు. కంటివెలుగు కార్యక్రమం నిర్వహణకు జిల్లాలో 34 బృందాలను నియమించారు. పరీక్షల కోసం 37యంత్రాలు, వైద్యులు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, ఆప్తాలమిస్టులను నియమించారు. జిల్లాలో 18ఏళ్లు పైబడిన వారు 4,87,124 మంది ఉండగా మే చివరినాటికి 3,91,219 మందికి పరీక్షలు నిర్వహించి 65,336 మందికి చూపు సమస్యను బట్టి రీడింగ్ అద్దాలు అందించారు. కంటికి అవసరమైన 48,293మందికి కళ్లద్దాలు తెప్పించారు.

కాటరాక్ట్ సమస్యలే ఎక్కువ

కంటివెలుగు శిబిరాల్లో పరీక్షలు చేసిన వారిలో కాటరాక్ట్, టెరీజియం సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో కాటరాక్ట్ సమస్యతో 36,023 మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో 160మందికి శస్త్రచికిత్సలు చేయించారు. టెరీజియం సమస్యతో బాధపడుతున్న 14,176మంది ఉన్నారని వైద్యాధికారులు పేర్కొన్నారు.

పీహెచ్‌సీలలో కొనసాగించాలని..

కంటివెలుగులో పనిచేసిన ఆప్తాలమిస్టు, డాటాఎంట్రీ ఆపరేటర్లు తమకు జిల్లాలోని పీహెచ్‌సిలలో పనిచేసే అవకాశం కల్పించాలంటూ కలెక్టర్, డీఎంహెచ్ఓలను కోరారు. కార్యక్రమం నిర్వహణకు తాము పనిచేశామని, అయితే పీహెసీలలో కంటివైద్యం నిత్యం అందుబాటులో ఉంచి తమకు పనిచేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

అవసరమైన వారికి ఆపరేషన్లు



జిల్లాలో జనవరి 18 న మొదలైన కంటివెలుగు శిబిరాల్లో శుక్ల సమస్యతో ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సలు అవసరమైన వారిలో 169మందికి చేయించాం. ఇంకా అవసరమున్న వారికి చేయిస్తాం. దాదాపు 4లక్షల మందికి పరీక్షలు చేశాం.

– డాక్టర్ మహేందర్, కో–ఆర్డినేటర్

జిల్లాకు డిజిటల్ బీపీ మెషీన్లు

- 242 మంది ఏఎన్ఎంలకు 242 కేటాయింపు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అందించనున్న అధికారులు
- ఇళ్లకు వెళ్లి, ప్రజలకు రక్తపోటు పరీక్షలు చేయాలని సర్కారు నిర్ణయం
- అవసరమైన మందులు వాడేలా చర్యలు



జిల్లాకు చేరిన డిజిటల్ బీపీ మెషీన్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వైద్య సిబ్బంది ఇళ్లకే వచ్చి ప్రజల బీపీ చెక్ చేసి, ఏ మందులు వాడాలో సూచిస్తారు. సాధారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చాలామందికి రక్తపోటు, మధుమేహం వస్తున్నాయి. వీటిని సకాలంలో గుర్తించక ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ఏఎన్ఎంలకు డిజిటల్ బీపీ మెషీన్లు అందించి, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సర్కారు సంకల్పించింది.

ఆరోగ్య కేంద్రాలకు రక్తపోటు వివరాలు..

పెద్దపల్లి జిల్లాలో 242 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. వీరికి అందించేందుకు 242 డిజిటల్ బీపీ మెషీన్లు బుధవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అధికారులు వీటిని ఏఎన్ఎంలకు అందజేయనున్నారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రజలకు రక్తపోటు పరీక్షలు చేసి, బాధితుల వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తారు. అక్కడి వైద్యులు బాధితులను మరోసారి పరీక్షించి, వివరాలు నమోదు చేసుకొని, ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. అవసరమైన మందులు ఇస్తారు.

జిల్లాలో 266 గ్రామాలు..

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. మొత్తం 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి బీపీ పరీక్షలు చేస్తున్నారు. నిర్ధారణ అయితే ప్రతీ 3 నెలలకోసారి వైద్యపరీక్షలు చేయించుకొని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని చెబుతున్నా వారు పట్టించుకోవడం లేదు. కనీసం రక్తపోటు స్థాయిని కూడా తెలుసుకోవడం లేదు. దీంతో జీవనశైలిపై తీవ్ర ప్రభావం చూపి, ఒక్కోసారి ప్రాణాలమీదకు వస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బీపీ మెషీన్లు వచ్చాయి



డిజిటల్ బీపీ మెషీన్లు వచ్చాయి. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో వాటిని ఏఎన్ఎంలకు పంపిణీ చేస్తాం. చాపకింద నీరులా విస్తరిస్తున్న బీపీని గుర్తించి, మందులు వాడకుంటే పెను ప్రమాదాలకు దారితీస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో బీపీ బాధితులకు ఉపశమనం కలుగుతుంది.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం

- సొంత ఖర్చులతో నిర్మించిన రామగుండం తహసీల్దార్



ఇంటిని ప్రారంభించిన తహసీల్దార్ జాహెద్‌పాషా

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీలో ఓ నిరుపేద కుటుంబానికి తహసీల్దార్ జాహెద్‌పాషా తన సొంత ఖర్చులతో ఇంటిని నిర్మించి, మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్టీ కాలనీకి చెందిన ధరావత్ లచ్చమ్మది పేద కుటుంబం. ఆమె కుమారుడు, కోడలు మృతిచెందగా మనవడు, మనవరాలితో పూరి గుడిసె ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు అది కూలిపోయింది. దీంతో వారు తలదాచుకునేందుకు నీడ కరువైంది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సంగీత వారికి ఇంటిని నిర్మించి, ఇవ్వాలని రామగుండం తహసీల్దార్ జాహెద్‌పాషాకు సూచించారు. ఆయన తన సొంత ఖర్చులతో గుడిసె స్థానంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు నిర్మించి, గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో రద్దీ



ఇంటర్‌సిటీకి ప్రయాణికుల తాకిడి

రామగుండం: శుభకార్యాల సీజన్.. పిల్లలకు సెలవులు కొనసాగుతుండడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. గురువారం హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా సుమారు మూడు గంటల ఆలస్యంగా నడిచింది. కాగజ్‌నగర్, సింగరేణి రైళ్లు కూడా గంటన్నర ఆలస్యంగా నడిచాయి. రైళ్ల ఆలస్యంతో చిన్న పిల్లలతో వచ్చిన కుటుంబాలు వడగాలులకు ఇబ్బందులు పడ్డాయి. ప్లాట్‌ఫారంపై ఉన్న నల్లాల నుంచి వేడి నీరు రావడంతో ప్రయాణికులు వాటర్ బాటిళ్ల కొనుగోళ్లకు ఎగబడ్డారు.

లారీ ఢీకొని ఆర్ఎంపీ దుర్మరణం

- ఒకరికి గాయాలు



రామస్వామి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని బంధంపల్లి వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ఆర్ఎంపీ జక్కుల రామస్వామి(54) మృతిచెందగా ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని శాంతినగర్‌కు చెందిన రామస్వామి పాలకుర్తి మండలంలోని కొత్తపల్లిలో ఆర్ఎంపీగా చేస్తున్నాడు. నిత్యం కొత్తపల్లికి బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. రోజూ మాదిరిగానే గురువారం ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో లారీ వేగంగా వచ్చి, ద్విచక్రవాహనాన్ని, ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన పిడుగు సతీశ్‌కు గాయాలయ్యాయి. రామస్వామి రెండు నిమిషాలైతే ఇల్లు చేరేవాడని, ఇంతలోనే ఘోరం జరిగిందని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు కాగా రెండో అమ్మాయి పెళ్లి, నెల రోజుల క్రితమే జరిగిందని తెలిపారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సర్పంచ్ భర్తపై కేసు

సారంగాపూర్: గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ విధులకు ఆటంకం కలిగించిన బీర్‌పూర్ సర్పంచ్ భర్త రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిని బిల్లుల చెల్లింపుల విషయంలో అసభ్యపదజాలంతో దూషించి, విధులకు ఆటంకం కలిగించాడని సతీశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావుపేట శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గజ్జెల మనోహర్ (42) మృతిచెందినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా రేంజర్‌లకు చెందిన మనోహర్ ద్విచక్రవాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా, వెంకట్రావుపేట శివారులో బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ఆ జాబ్‌మేళాతో సంబంధం లేదు'

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపడుతామంటూ ఓ ప్రైవేటు ఐటీఐవారు ప్రకటించిన జాబ్‌మేళా అసత్యమని, సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీపీసీ యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రాజెక్టులో ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సీఅండ్ఐ, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, రిగ్గర్, హెల్పర్, ఆపరేటర్ విభాగాల్లో మూడేళ్ల అనుభవమున్న నిరుద్యోగులకు కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగావకాశం కల్పిస్తామని, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్స్, రెజ్యూమ్, సెట్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఇటీవల ఓ ఐటీఐ ప్రకటించింది. ఈ క్రమంలో ఆ ప్రకటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని యాజమాన్యం కొట్టిపారేసింది. ఇలాంటి ఫేక్ వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రామగుండం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

రామగుండం: రామగుండం పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ వైభవ్‌గైక్వాడ్ గురువారం సందర్శించారు. ఆయనకు సీఐ చంద్రశేఖర్‌గౌడ్ స్వాగతం పలికారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆధునిక పరిజ్ఞానంతో కేసులను చేధించాలన్నారు. వాహనాలను తనిఖీ చేయాలని, నంబర్ ప్లేట్లు లేనివాటిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను గ్రామీణ ప్రజలకు వివరించాలన్నారు. ఎస్సై శరణ్య, పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులున్నారు.

నేరప్రవర్తన మార్చుకోండి

గోదావరిఖని: రౌడీషీటర్లు నేరప్రవర్తన మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్ హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. నిందితులు నేర ప్రవృత్తిని వీడాలని, ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తూ దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. పీడీ యాక్ట్‌కూ వెనకాడబోమన్నారు. వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఆర్జీ-3 ఏరియాలో 88 శాతం బొగ్గు ఉత్పత్తి



ఉత్పత్తి వివరాలు తెలుపుతున్న ఏపీఏ జీఎం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో మే నెలలో 88 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కె.వెంకటేశ్వర్లు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఓపీసీ-1లో 2.6 లక్షల టన్నులకు 2.77టన్నులు సాధించి 107 శాతం, ఓపీసీ-2 1.9 టన్నులకు 1.18 టన్నులతో 62 శాతం సాధించిందన్నారు. ఆర్జీ-3 ఏరియా 3.94 టన్నుల ఉత్పత్తి సాధించి 88 శాతం నమోదు చేసిందన్నారు. సీహెచ్‌పీ, రోడ్డు ద్వారా 6.49 లక్షల టన్నులు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఆర్జీ-3 డివిజన్ నుంచి 29.52 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించినట్లు తెలిపారు. 107 శాతం బొగ్గు ఉత్పత్తి చేసిన ఓసీపీ-1 ఉద్యోగులను అభినందించారు. కొద్ది రోజుల్లోనే 10వ గని ఓసీపీ-1 కలిసిపోతుందన్నారు. అడ్రియాల ప్రాజెక్టులో కేవీటీ, వాటర్, రూఫ్ సమస్యల వలన ఉత్పత్తి లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నామని తెలిపారు. సమావేశంలో అధికారులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, నరేందర్, రఘుపతి, చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, లక్ష్మీనారాయణ, ఐలయ్య, కళ్యాణచక్రవర్తి, రవీందర్‌రెడ్డి, మారుతిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో 101 శాతం..



మాట్లాడుతున్న జీఎం అబ్దుల్ సలీం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో 101శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేనెలలో 7.76లక్షల టన్నుల లక్ష్యానికి 7.86లక్షల టన్నులు 101శాతంగా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 49.95లక్షల క్యూబిక్ మీటర్ల, ఓబి వెలికితీతకుగాను 51.74లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించి 104శాతం సాధించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ రాధాక్రిష్ణారావు, రక్షణ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో పెరిగిన వృద్ధిరేటు

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: నెలవారీ లక్ష్యం తగ్గినప్పటికీ బొగ్గు ఉత్పత్తిలో వృద్ధిరేటు పెరిగిందని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేనెలలో 3.92లక్షల టన్నుల లక్ష్యానికి 3.59లక్షల టన్నులు సాధించి 92శాతం నమోదు చేసిందన్నారు. ఏరియాకు టార్గెట్ పెంచడంతో నిర్దేశిత లక్ష్యాల సాధనలో వెనుకపడినట్లు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే 8శాతం వృద్ధిరేటు నమోదైందన్నారు. మరో 15నెలల్లో ర్యాపిడ్‌గ్రావిటీ పిల్లర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నీటిని శుద్ధిచేసే నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. గోదావరినది ఇంటెక్ వద్ద సాంకేతిక లోపంతో నీటి సరఫరాలో ఇబ్బంది అవుతోందని, త్వరలో సమస్య అధిగమిస్తామని వెల్లడించారు. డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సివిల్ డీజీఎం నవీన్, ఐఈడీ డీజీఎం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకెళ్లాలి

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో సమష్టిగా ముందుకెళ్లాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. గురువారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాలు, గనుల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెలలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీతపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. బొగ్గు రవాణా, నాణ్యత, రక్షణ విషయంలో రాజీలేకుండా ముందుకు సాగాలన్నారు. ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ బి.సైదులు, ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్, ఏజీఎం ఆంజనేయులు, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో ఆవిర్భావ వేడుకలు లేనట్లేనా?

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఈసారి లేనట్టే కనిపిస్తున్నాయి. రామగుండం రీజియన్‌లో మూడు ఏరియాలు ఉండగా.. ఆర్జీ-2లో మాత్రం వేడుకలను సంస్థ రద్దు చేసినట్లు సమాచారం. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల కోసం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాలకు రూ.3లక్షల చొప్పున యాజమాన్యం కేటాయించింది. అన్ని డిపార్ట్‌మెంట్లను అనుసంధానం చేసుకుని వేడుకలు నిర్వహించాలని సూచించింది. ఇందులో భాగంగా ఈనెల 2నుండి 5వరకు ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాన ఉత్సవాన్ని సింగరేణిలోని ఆయా స్టేడియాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే రెండు ఏరియాలకు ఒకే ఎమ్మెల్యే ఉండటంతో ఆర్జీ-2లో వేడుకలు రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్‌ను ఆర్జీ-3 ఏరియా ఉత్సవాలకు అదనపు ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న జీఎం ఉద్యోగ విరమణ పొందడం, ఇక్కడ వేడుకలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆవిర్భావ వేడుకలు ఆర్జీ-2లో రద్దు చేయడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా లేని నిబంధన ఇప్పుడు ఎందుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. సుమారు 3,700మంది పర్మినెంట్ ఉద్యోగులు, 2వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగులు నివాసముంటున్న ఏరియాలో వేడుకలు రద్దు చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది. గుర్తింపు సంఘం చేతకానితనం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4న సాయంత్రం గోదావరిఖని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో రిటైర్డ్ కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీలు, యూనియన్లకు అతీతంగా దిగిపోయిన కార్మికులు హాజరుకావాలని కోరారు. పెన్షన్, సీపీఆర్ఎంఎస్, వైద్య సేవలు, ఇతర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సింగరేణిలో 95వేలకుపైగా రిటైర్డ్ కార్మికులు ఉన్నట్లు తెలిపారు. నాయకులు ధర్మపురి, అక్బర్‌అలీ, లక్ష్మీపతిగౌడ్, ఎట్టం కృష్ణ, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నుంచి అర్ధరాత్రి ఇసుక దందా

- అంతర్గాం మండలం నుంచి పాలకుర్తి మండలానికి యథేచ్ఛగా రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి పట్టించుకోని అధికారులు



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

పాలకుర్తి(రామగుండం): అంతర్గాం మండల పరిధి గోదావరినది పరివాహక ప్రాంతం నుంచి పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాలకు ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం అర్ధరాత్రి అక్రమార్కులు ట్రాక్టర్లలో బుగ్గ రహదారి మీదుగా జీడీనగర్, బసంత్‌నగర్, రాజీవ్‌నగర్‌లతోపాటు పెద్దపల్లి మండలంలోని కురుమపల్లి తదితర గ్రామాలకు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రిప్పునకు దూరాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులు ముందుగా బైక్‌పై దారి వెంట అధికారులు ఎవరైనా ఉన్నారా లేదా అని చూస్తూ డ్రైవర్లకు సమాచారం అందిస్తూ దందాను కొనసాగిస్తున్నారు. దారిలో ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకూ వెనుకాడటం లేదన్న ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని పలువురు అంటున్నారు.

ఫొటోలు తీసిన మీడియాపై చిందులు...

బుధవారం అర్ధరాత్రి అంతర్గాం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను జీడీనగర్ ప్రధాన రహదారిపై స్థానిక మీడియా ప్రతినిధులు గుర్తించి, ఫొటోలు తీశారు. దీంతో బామ్లానాయక్‌తండా పరిధిలోని రాజీవ్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బదావత్ శంకర్‌నాయక్ వారితో వాగ్వాదానికి దిగాడు. ఈ ట్రాక్టర్లు తనవేనని, ఫొటోలు ఎందుకు తీస్తున్నారంటూ చిందులు వేశాడు. ఎస్సైకి చెబుతారా, సీఐకి చెబుతారా.. ఎవరికైనా చెప్పుకోండి.. నన్నేం చేయలేరంటూ దురుసుగా ప్రవర్తించాడు. సంబంధిత శాఖ అధికారుల సహకారం ఉండటం వల్లే అతను ఇలా మాట్లాడాడని చర్చ జరుగుతోంది. ఎస్ఆర్‌వో, ఎస్ఆర్ఏలు ఉదయం వేళల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూస్తున్నారని మైనింగ్ ఏడీ సాయినాథ్ తెలిపారు. అయితే రాత్రివేళల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. నిఘా పెంచి, అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పాలకుర్తి మండల పరిధిలో ఇసుక రీచ్‌లు లేవని తహసీల్దార్ సునీత తెలిపారు. అంతర్గాం మండలంలోని రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. మండలంలో ఎంట్రీ పాయింట్‌ల వద్ద వీఆర్ఏలను గస్తీ పెట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.